నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 5 సెప్టెంబర్ 2024 | KHAMMAM

వరద బాధితులకు సాయం చేస్తా..

- పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి
- రాకాశితండా, బీరోలు గ్రామాల్లో నిత్యావసరాలు పంపిణీ

బందంపల్లిలో వరద బాధితులతో మాట్లాడి ధైర్యం చెబుతున్న కందాల ఉపేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 4 : వరదలతో నష్టపోయిన బాధితులకు తనవంతుగా సాయం అందిస్తానని, ఎవరూ అధైర్యపడొద్దని మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆకేరు వరద ప్రవాహంతో తీవ్రంగా నష్టపోయిన రాకాశితండా, రావిచెట్టుతండాలను బుధవారం ఆయన సందర్శించారు. ఇళ్లు మునిగిపోయిన బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఆకేరు వరద ఉధృతి వల్ల ఇసుక మేటలు మేసిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. జల్లేపల్లి హైస్కూల్‌లోని పునరావాస కేంద్రంలో ఉన్న రాకాశితండా వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. రావిచెట్టుతండా వద్ద కొట్టుకుపోయిన బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం బీరోలు చెరువు తెగి ముంపునకు గురైన బందంపల్లి దళిత కాలనీవాసులను పరామర్శించారు. బాధితులకు సాయంత్రంలోగా వారం రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేయాలని పార్టీ శ్రేణులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బాషబోయిన వీరన్న, దేవరం దేవేందర్‌రెడ్డి, నాయకులు చావా వేణు, చామకూరి రాజు, ఆలస్యం నాగేశ్వరరావు, ఆర్మీ రవి, తాతా రవీందర్, బోడ మంచానాయక్, వంచర్ల సత్యనారాయణరెడ్డి, పరికపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరదల్లో మృతిచెందిన దంపతుల కుటుంబసభ్యులకు చెక్కులు అందజేత

కూసుమంచి : చెక్కులను అందిస్తున్న మంత్రి పొంగులేటి, ఖమ్మం కలెక్టర్

కూసుమంచి, సెప్టెంబర్ 4 : మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన యాకూబ్, సైదాబీ దంపతులు వరదల్లో మృతిచెందిన విషయం విదితమే. వారి కుటుంబసభ్యులకు బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి ఆర్థికసాయం చెక్కులను అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల సాయాన్ని ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున చెక్కులను యాకూబ్ సోదరుడు లాల్‌సాబ్ ఇంటి వద్ద మృతుల కుమారులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ వారిని బతికించాలని చాలా ప్రయత్నాలు చేశాం.. కానీ ఫలితం దక్కలేదు.. మీ కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీవో గణేశ్, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ సంజీవ్, తహసీల్దార్ సురేశ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

షరీఫ్‌ను కాపాడిన వారికి ప్రశంసలు

వరదల్లో నాయకన్‌గూడెంలో ముగ్గురు ఇంటిపై కప్పుపై ఉండగా వారికి లైఫ్‌జాకెట్లు, ట్యూబ్‌లు అందించిన పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, వ్యవసాయ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశంసించారు. అందరి సహకారంతో ఒక ప్రాణాన్ని కాపాడుకోగలిగామన్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో హెలికాప్టర్ రాలేదనే విషయాన్ని కుటుంబ సభ్యులకు మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా వెంకటేశ్వర్లు, ఉమాదేవి

జి.వెంకటేశ్వర్లు | ఎం.సింహాచలం | కే.ఓంకార్

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 4 : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఖమ్మం జిల్లా నుంచి కొణిజర్ల మండలం జడ్పీహెచ్ ఎస్ పెద్దగోపతి పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(తెలుగు) జి వెంకటేశ్వర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఎంపీపీ ఎస్ ఆర్ఎన్ గుట్ట పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న దల్లి ఉమాదేవి ఎంపికయ్యారు. వీరికి గురువారం హైదరాబాద్‌లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేయనున్నారు.

- కళాశాల విద్య పరిధిలో ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కే ఓంకార్ ఎంపికయ్యారు.
- జూనియర్ కళాశాల పరిధిలో ఖమ్మం జిల్లా ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఎం.సింహాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ జేఎల్‌గా పనిచేస్తున్న ఎండీ ఖుర్షీద్ అహ్మద్ ఎంపికయ్యారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం వాయిదా..

కాగా.. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లాలో వరదలు, భారీ వర్షాల కారణంగా వాయిదా వేశారు. వరదల వల్ల ఎంతో మంది నిరాశ్రయులుగా మారారని, ఈ సమయంలో వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించారు. వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత కలెక్టర్ అనుమతితో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు చేయనున్నట్లు విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు.

ఎంపీ వద్దిరాజు దాతృత్వం

వరద బాధితులకు విరాళంగా నెల వేతనం

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, సెప్టెంబర్ 4 : ఖమ్మం నగరంలోని మున్నేరు వరద బాధితుల కోసం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సోమ, మంగళవారాల్లో మున్నేరు లోతట్టు ప్రాంతంలో వరద బాధితులను పరామర్శించి కొండంత అండగా నిలిచిన విషయం తెలిసిందే. ముంపు ప్రజల కష్టాలను కళ్లారా చూసిన ఆయన పుట్టెడు దుఃఖంలో ఉన్న వారిని ఆదుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తన ఒక నెల జీతాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ఎంపీ వద్దిరాజు ప్రకటించారు.

- సర్కారు సహకారం అందక బాధితుల ఇక్కట్లు
- సీఎం ఇస్తానన్న రూ.10 వేలు ఇవ్వనే లేదు
- పూర్తిస్థాయిలో మెరుగుపడని పారిశుధ్యం
- ఇంకా చీకట్లోనే ముంపు ప్రాంత కాలనీలు
- అక్కడక్కడా నిత్యావసరాల పంపిణీలు

మున్నేరు శాంతించినా.. సాయం జాడ లేదు

ఖమ్మం కాల్వొడ్డులో రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఖమ్మం, సెప్టెంబర్ 4: మున్నేరు శాంతించింది. ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్లోని దాని పరీవాహక ప్రాంతాల ప్రజలు ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్నారు. కానీ సర్కారు సహాయ సహకారాలు అందక వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యం పూర్తిస్థాయిలో మెరుగుపడలేదు. ముంపు ప్రాంత కాలనీలన్నీ ఇంకా చీకట్లోనే మగ్గిపోతున్నాయి. నిత్యావసర సరుకుల పంపిణీలు అక్కడక్కడా జరుగుతున్నాయి. ఇకమొన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తామన్న రూ.10 వేల సాయం అందనేలేదు. ఇంట్లోని వస్తువులన్నీ కొట్టుకుపోయి, ఇళ్ల నిండా బురద పేరుకుపోయి కష్టాల సుడిగుండంలో ఉన్న ముంపు ప్రాంతాల ప్రజలు మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతున్నారు. అంతులేని ఆవేదనను దిగమింగుకుంటూ నడుం వంచి ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు.

సహాయ సహకారాలకు ఎదురుచూపులు..

ఆయా కాలనీల ప్రజలు తమ ఇళ్లకు పట్టిన బురదను శుభ్రం చేసుకునేందుకు నీళ్ల ట్యాంకర్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రదాన వీధుల్లోకి ట్యాంకర్లు వస్తున్నా లోపలి ప్రాంతాల్లోకి, కాస్త ఇరుకైన సందుల్లోకి వెళ్లడం లేదు.

దీంతో ఆయా ప్రాంతాల్లోని ఇళ్లు ఇంకా బురదలోనే ఉన్నాయి. ముంపు ప్రాంతాలైన గణేశ్‌నగర్, మాణిక్యనగర్, బొక్కలగడ్డ, మోతీనగర్ తదితర ప్రాంతాల్లో నాలుగు రోజులైననా బురద బాధ తొలగలేదు. రోడ్లు మాత్రమే కాస్త శుభ్రమయ్యాయి. విద్యుత్ పునరుద్ధరణ ఇంకా జరగలేదు. విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం 10 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను అందిస్తున్నప్పటికీ అవి కూడా పూర్తిస్థాయిలో అందలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే, కాంగ్రెస్ నాయకులు వారికి అనుకూలమైన వారికే వాటిని అందజేస్తున్నట్లు స్థానిక వరద బాధితులు ఆరోపిస్తున్నారు. దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నష్టపరిహారం అందించేందుకు అధికారులు బాధితుల ఇళ్లకు వెళ్లి వారి బ్యాంకు ఖాతాల వివరాలు సేకరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. .కాలువలు మొత్తం వ్యర్థాలతో నిండి కంపుకొడుతున్నాయి.

మరమ్మతులకు తరలుతున్న వాహనాలు..

మున్నేరు ముంపునకు గురైన ఇళ్లలోని అన్ని రకాల వాహనాలూ బురదలో కూరుకుపోయాయి. ఇంకొన్ని వరదకు కొట్టుకుపోయాయి. అయితే బురదతో కూరుకుపోయి మట్టిపట్టిన వాహనాలను వాటి యజమానులు మరమ్మతుల కోసం షెడ్లకు తరలిస్తున్నారు. బైకులు, కార్ల తాళ్ల సాయంతో లాగుతూ తీసుకెళ్తున్నారు. అయితే వాటి మరమ్మతులకు కూడా రూ.వేలల్లో ఖర్చవుతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్‌సీఐ రోడ్డులో నిలిపి ఉన్న లారీల్లోకి కూడా వరద వెళ్లడం, వాటికి బురద పట్టడం వంటి కారణాలతో వాటిని అక్కడే నిలిపి మెకానిక్‌లతో మరమ్మతులు చేస్తున్నారు.

తాగడానికి నీళ్లు పోసినోళ్లు కూడా లేరు..

వరదలు ముంచుకొచ్చినప్పుడు మా బతుకులు నీళ్లలోనే ఉన్నాయి. ఆ సమయంలో మమ్ములను కాపాడే వాడే లేడు. కనీసం తాగడానికి మంచి నీళ్లు పోసిన నాథుడు కూడా లేడు. గవర్నమెంటోళ్లు ఇప్పుడొచ్చి మాటలు చెబుతున్నారు తప్ప పేదల గురించి పట్టించుకోవడం లేదు. మా ఇళ్లలోని బురదను శుభ్రం చేసుకోవానికి కూడా నీళ్లు లేవు. ట్యాంకర్లను మేము ఎక్కడి నుంచి తెచ్చుకోవాలి? మా కాలనీలకు ప్రభుత్వం వాళ్లు ట్యాంకర్లను పంపలేదు.

–కేతం దేవికమ్మ, ఖమ్మం

ప్రాణాలు తప్ప ఏమీ మిగలలేదు..

ప్రాణాలు తప్ప మాకు ఏమీ మిగలలేదు. ఇప్పుడు మాకు దిక్కెవరయ్యా.. నాలుగు రోజులైనా ఇళ్లు శుభ్రం చేసుకునే పరిస్థితి లేదు. తాగడానికి కనీసం మంచి నీళ్లు లేవు. ఇంట్లో భోజనం లేదు. వరద వస్తుందని ముందే చెప్పినా మా వస్తువులను కాపాడుకునేవాళ్లం. కానీ ఏ ఒక్కరూ చెప్పలేదు. ప్రాణాలు పోతాయేమోనని భయపడ్డాం. కానీ దేవుడి దయ వల్ల ప్రాణాలతో బయటపడ్డాం. వస్తువులని పోయాయి.

–బోయినపల్లి ఉష, పీఎస్ఆర్ రోడ్, ఖమ్మం

నిరుడు రాజమండ్రినుంచి పడవలు తెప్పించారు..

దేవుడిలాంటి కేసీఆర్ ఉండి ఉంటే మా బతుకులు ఇలా ఉండేవి కావు. ఇలాంటి ప్రకృతి విపత్తులప్పుడు ఆయన వెంటనే స్పందించిన ముమ్మలను రక్షించేవారు. కానీ ఇప్పుడున్న పాలకులు ముప్పు గురించి మాకు మాటమాత్రంగానైనా చెప్పలేదు. నిరుడు వరదలప్పుడు అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కూడా మాలాంటి నిరుపేదలకు ఎంతో చేశారు. నిరుడు వదరలు వచ్చినప్పుడు రాత్రికి రాత్రే రాజమండ్రి నుంచి పడవలు తెప్పించారు. మావాళ్లందరికీ రక్షణగా నిలిచారు.

–పిల్లలమర్రి సోమలక్ష్మి, పీఎస్ఆర్ రోడ్, ఖమ్మం

డీసీసీబీలో మరో ఇద్దరు జీఎంల సస్పెన్షన్

ఇన్‌చార్జి సీఈవోగా వసంతరావు

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 4 : డీసీసీబీలో ఒక్కరోజు వ్యవధిలోనే మరో ఇద్దరు జనరల్ మేనేజర్లపై సస్పెన్షన్ వేటు పడింది. పంట రుణమాఫీ విషయంలో అనేక పొరపాట్లు జరిగిన నేపథ్యంలో డీసీసీబీ సీఈవో రెహమాన్ సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా డీసీసీబీ జీఎంలుగా విధులు నిర్వహిస్తున్న నర్మద, పద్మావతిలపై సైతం సస్పెన్షన్ వేటుపడింది. పద్మావతి ప్రస్తుతం ఇక్కడే జీఎంగా విధులు నిర్వర్తిస్తుండగా.. గతంలో ఇదే బ్యాంకులో జీఎంగా విధులు నిర్వహిస్తూ తన పూర్వపు స్థానం నల్లగొండ జిల్లాకు బదిలీ అయిన నర్మదపై వేటుపడింది. గురువారం డీసీసీబీ పాలక మండలి సమావేశం జరగబోతున్న నేపథ్యంలో ముగ్గురు అధికారులపై వేటుపడడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. కాగా.. ప్రస్తుతం జీఎంగా విధులు నిర్వర్తిస్తున్న వసంతరావు ఇన్‌చార్జి సీఈవోగా బాధ్యతలు చేపట్టారు.

ఏ ఒక్కరూ అధైర్యపడొద్దు

- వరద బాధితులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుంది
- ఖమ్మం జిల్లాలో ప్రాథమిక అంచనాలో 7,500 ఇళ్లు మునిగాయి
- అందులో నగరంలోనే 5 వేల ఇళ్లు ముంపునకు గురయ్యాయి
- సమావేశంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, సెప్టెంబర్ 4: ఖమ్మం జిల్లాలో ఇటీవలి వర్షాలు, వరదల కారణంగా నిరాశ్రయులైన బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఏ ఒక్కరూ అధైర్యపడొద్దని సూచించారు. ఖమ్మంలోని కేఎంసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అకస్మాత్తుగా వచ్చిన మున్నేరు వరదల కారణంగా ఖమ్మం నగరంలో సుమారు 5 వేల ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో మరో 2,500 ఇళ్లు కలిపి మొత్తం 7,500 ఇళ్లు ముంపునకు గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు వివరించారు. అధికారులు ఇంకా క్షేత్రస్థాయి పరిశీలనలో ఉన్నారని, మరో రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి నివేదికలు వస్తాయని అన్నారు. గడిచిన వందేళ్లలో మున్నేటికి ఇంత వరద ఎన్నడూ రాలేదని అన్నారు. అయినప్పటికీ ఒక్క ప్రాణనష్టమూ జరుగకుండా కలెక్టర్, సీపీ సహా ఇతర అధికారులు చర్యలు తీసుకున్నారని అన్నారు. వారి కృషిని అభినందిస్తున్నట్లు చెప్పారు. అలాగే, వరద ముంపు ప్రాంతాల్లో శానిటేషన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, విద్యుత్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని తుమ్మల వివరించారు. ప్రతి ఇంటికీ నిత్యావసర సరుకులు ఇస్తున్నామని, అవసరమైతే రెండోసారి కూడా పంపిణీ చేస్తామని అన్నారు. గురువారం నుంచి బాధితుల ఖాతాల్లో నగదును జమచేస్తామన్నారు. వరద తెచ్చిన బురదను తొలగించేందుకు 100 ట్రాక్టర్లు, 50 జేసీబీలు, 70 ట్యాంకర్లు పనిచేస్తున్నాయన్నారు. పునరావాస కేంద్రాలను మరికొద్ది రోజుల వరకూ కొనసాగిస్తామన్నారు. చాలా వరకు విద్యుత్ మీటర్లు తడిచినందున వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు అందిస్తున్నాయన్నారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ పాల్గొన్నారు.

కాలుపెట్టి తరం లేదు..

- అటు కరెంట్ లేక.. ఇటు నీళ్లు రాక ఇక్కట్లు..
- బాధితులకు బురదమడులే దిక్కవుతున్న తీరు
- మరోవైపు పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు

పెద్దతండా పరిధిలోని డీబీఆర్ కాలనీ వీధులు

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 4: వరద ఉధృతి తగ్గి నాలుగు రోజులు కావస్తున్నప్పటికీ ముంపు ప్రాంతాల కాలనీల్లో కాలుపెట్టతరం కావడం లేదు. దీంతో వరద బాధితుల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవల మున్నేరు ఉప్పొగండంతో మండలంలోని దాని పరీవాహక గ్రామాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఇళ్లన్నీ వరద నీటిలో మునిగిపోయాయి. ఒకవైపు ఆస్తి నష్టం, మరో వైపు పంట నష్టంతో ప్రజలు రూ.కోట్లలో నష్టపోవాల్సి వచ్చింది. అయితే, వదర తగ్గిన నాలుగు రోజుల తరువాత కూడాఏ ఒక్క కుటుంబమూ తిరిగి వారి ఇంటిలో జీవనం గడిపే అవకాశం లేకుండా పోయింది. ఫోర్ట్‌క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, డీబీఆర్ కాలనీ, జలగంనగర్, వికలాంగుల కాలనీలు ఇంకా అంధకారంలోనే ఉన్నాయి. దీంతో ఇళ్లను శుభ్రం చేసుకునేందుకు కాలనీవాసులు నానా యాతనలు పడుతున్నారు. కనీసం ఇంట్లో మోటర్ వేసుకునే పరిస్థితి లేదు. మిషన్ భగీరథ నీళ్లూ రావడం లేదు. దీంతో మట్టిని తొలగించుకునేందుకు అవకాశమే లేదు. ఇంట్లో ఉన్న వంట పాత్రలను, దుస్తులను ఇళ్ల ముందున్న బురద నీటితోనే శుభ్రం చేసుకుంటున్నారు. కనీస అవసరాలైన కరెంట్, నీరు లేకపోవడంతో బాధితుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు..

కాలనీలన్నీ ఇంకా బురదలోనే ఉండడంతో ఆయా కాలనీల్లో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. ఈ ప్రాంతంలో కనీసం బ్లీచింగ్ చల్లిన నాథుడే కరువయ్యాడు. ఈ కాలనీల్లోని దినసరి కూలీల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ప్రభుత్వం ఇస్తానన్న రూ.పది వేల సాయం ఇచ్చినా కనీసం నిత్యావసర సరుకులైనా కొనుగోలు చేసుకుంటామని వేడుకుంటున్నారు.

నాలుగు రోజుల నుంచి చీకట్లోనే ఉంటున్నాం

వరద వచ్చిన రాత్రి నుంచి ఇప్పటి వరకు మా ఇంట్లోనూ, మా కాలనీలోనూ కరెంట్ లేదు. ఎవరిని అడగాలో తెలియడం లేదు. తెలిసిన ప్రతి ఒక్కరికీ ఫోన్ చేశాం. ఎవరూ సాయం చేయడం లేదు. మా కాలనీకి ఏ ఒక్క అధికారి కూడా రాలేదు. పిల్లలతో కలిసి మా ఇంటి ముందు ఉన్న మురుగునీటిలోనే పాత్రలు, బట్టలు శుభ్రం చేసుకుంటున్నాం.

–గడ్డం విజయలక్ష్మి, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ, పోలేపల్లి

మంత్రి చెప్పినా.. అందని సాయం

- రాకాశితండా వరద బాధితుల ఆవేదన
- కట్టుబట్టలతో నిరాశ్రయులైన తండావాసులు
- కంటితుడుపుగా మంత్రి పొంగులేటి పర్యటన

ఆకేరు ప్రవాహానికి నీట మునిగిన రాకాశితండా దుస్థితి

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 4 : 'ఆకేరు వరద ప్రవాహం తమ తండాను అతలాకుతలం చేసింది. సర్వం కోల్పోయేలా చేసింది. కట్టుబట్టలతో మిగిల్చింది. ఇంత జరిగినా ప్రభుత్వం నుంచి ఆదుకునేవారు కరువయ్యారు. మంత్రి పొంగులేటి వచ్చి ఆదేశాలిచ్చినా పట్టించుకునేవారు లేరు' అంటూ మండలంలోని రాకాశితండా వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షంతో ఆకేరు ఉగ్రరూపం దాల్చడంతో రాకాశితండా పూర్తిగా నీట మునిగిన విషయం తెలిసిందే. వరదలతో పంటలు, ఇంటి సామగ్రి, బియ్యం, ఇతర వస్తువులు కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలామని, తమ తండాను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించి అధికారులను ఆదేశించినా.. ఇంతవరకు ఎలాంటి సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాస కేంద్రంలో ఉంచి ఆహారం మాత్రం అందిస్తున్నారని తెలిపారు.

ఎలాంటి సాయం అందలే..

ఆకేరు వరదతో మా తండా మునిగిపోయి కట్టుబట్టలతో వచ్చాం. ఇళ్లలోని సామాన్లు, తిండి గింజలన్నీ కొట్టుకుపోయాయి. మమ్మల్ని జల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉంచి అన్నం పెడుతున్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి, అధికారులు వచ్చిపోయారు తప్ప మాకు ఎవరు ఇంతవరకు సాయం చేయలేదు.

–బానోత్ శారద, వరద బాధితురాలు, రాకాశితండా

తాగడానికి నీళ్లు కూడా లేవు..

నీళ్లలో నుంచి తండా బయటపడి మూడు రోజులైంది. ఇళ్లలో బురద అట్లనే ఉంది. ఇళ్లు కడుక్కోవడానికి కూడా నీళ్లు ఇవ్వలేదు. తాగడానికి మంచినీళ్లు పంపిన నాథుడు లేడు. కనీసం వండుకొని తినడానికి వంట సామాన్లు లేవు. తండాలో కరెంటు రాలేదు. పత్తి పంట కొట్టుకుపోయింది. ఎలా బతకాలో అర్థం కావట్లేదు.

– శ్రీదేవి, వరద బాధితురాలు, రాకాశితండా

మంత్రి చెప్పినా న్యాయం జరగట్లే..

ఆకేరు వరదతో రెండున్నర ఎకరాల్లో మిరప, వరి పొలం నాశనమైంది. ఇళ్లలో వస్తువులన్నీ పాడైపోయాయి. మా తండాలో అందరి పరిస్థితి ఇలాగే ఉంది. పంట భూముల్లో మేటలు వేసి పనికి రాకుండా రాళ్లు తేలాయి. తండా మంత్రి వచ్చి చెప్పినా ఎలాంటి సహాయం అందలేదు.

– బోడ కౌసల్య, వరద బాధితురాలు, రాకాశితండా